


నేటి దర్శిని తెలుగు దిన పత్రిక లో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365

WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

PRGI NO: APTEL/26/A5450

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...




Contact Number
9059328777

విజయవాడ ఆదివారం 6-09-2026 సంపుటి: 02 సంచిక : 67 వెల: 2 రూ పేజీలు :04 సంపాదకులు: కట్ట హిమ పావని

Vijayawada Sunday, 6-09-2026 Volume :02 Issue: 67 RS: 2 Pages:04 Editor : Katta HimaPavani



# పాక్ చిత్తు చిత్తు!

7 వికెట్ల తేడాతో టీమిండియా హ్యాట్రిక్ విక్టరీ

- 55 పరుగులకే చాపచుట్టేసిన దాయాది
- 8.4 ఓవర్లలోనే ఛేదించిన భారత్
- ఓటమితో మూసుకుపోయిన పాక్ సెమీస్ దారులు
- అత్యధిక మ్యాచ్‌లాడిన కెప్టెన్‌గా కౌర్ రికార్డు
- మహిళల టీ20 ఆసియా కప్ టోర్నీ

దుబాయ్ వేదికగా పాకిస్తాన్‌పై టీమిండియా దుమ్మురేపింది. మహిళల టీ20 ఆసియా కప్‌లో చిరకాల ప్రత్యర్థిని కేవలం 55 పరుగులకే కుప్పకూల్చిన భారత్.. 8.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించి 7 వికెట్ల ఘన విజయం సాధించింది. దీంతో వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసి హ్యాట్రిక్ కొట్టింది. భారత బౌలర్ల ధాటికి పాక్ బ్యాటర్లు నిలవలేకపోగా.. హర్మన్‌ప్రీత్ కౌర్, దీప్తి శర్మ రాణించడంతో టీమిండియా అలవోకగా గెలుపొందింది. మరోవైపు కెప్టెన్‌గా 150వ అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఆడిన హర్మన్‌ప్రీత్ అరుదైన రికార్డు సొంతం చేసుకుంది.

02



02

## పిల్లల కన్నా వృద్ధుల జనాభా ఎక్కువ!

- మానవ చరిత్రలో ఇదే తొలిసారి
- 2025లో తొలిసారి వృద్ధుల జనాభా అధికం
- ఐదేళ్లలోపు పిల్లల సంఖ్యను దాటిన వృద్ధులు
- తగ్గుతున్న జననాల రేటుతో మారుతున్న జనాభా
- పెరుగుతున్న ఆయుర్దాయంతో వృద్ధుల సంఖ్య పెరుగుదల
- 2025లో 65 ఏళ్లు పైబడిన వారు 85.20 కోట్లు
- 2060 నాటికి 200 కోట్లకు చేరనున్న వృద్ధులు
- ప్రపంచ జనాభాలో 55 శాతం పెరుగుదల వృద్ధుల్లోనే
- 2060 నాటికి ప్రతి ఐదుగురిలో ఒకరు వృద్ధులే



02

## 4 రాష్ట్రాల్లో ముందుగానే జనగణన.

- గోవా, యూపీ, పంజాబ్, ఉత్తరాఖండ్‌కు వర్తింపు
- డిసెంబర్ 1 నుంచి జనవరి 4 వరకు గణన
- జనవరి 5 నుంచి 9 వరకు సమీక్ష దశ
- జనగణన చట్టం ప్రకారమే నిర్ణయం
- షెడ్యూల్‌ను ధ్రువీకరించిన రిజిస్ట్రార్ జనరల్
- కేంద్రం నిర్ణయంపై జైరామ్ రమేశ్ ప్రశ్నలు
- ఎన్నికల నేపథ్యంలో ముందస్తు చర్యపై కాంగ్రెస్ విమర్శ

# పీఆర్‌సీకి గ్రీన్ సిగ్నల్

ఉద్యోగులకు భారీ వరాలు

- 12వ పీఆర్‌సీకి గ్రీన్‌సిగ్నల్
- రెండు పెండింగ్ డీఏలకు మోక్షం
- అక్టోబర్ నుంచి డీఏలు చెల్లింపు
- సరెండర్ లీవులకు సంక్రాంతిలోగా చెల్లింపులు
- పెన్షనర్లకు అదనపు క్వాంటమ్ పునరుద్ధరణ
- ఈహెచ్ఎస్ చెల్లింపులు ఇక క్రమబద్ధీకరణ
- రూ.30,849 కోట్ల పెండింగ్ బిల్లులు క్లియర్
- ఉద్యోగుల సమస్యలపై సానుకూల వైఖరి
- ప్రభుత్వ నిర్ణయాలపై ఉద్యోగ సంఘాల హర్షం
- ఆర్థిక ఇబ్బందులున్నా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం: సీఎం చంద్రబాబు

అమరావతి,

ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 12వ వేతన సవరణ సంఘం (పీఆర్‌సీ) ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు కరువు భత్యాల్లో (డీఏ) రెండు డీఏలను విడుదల చేసేందుకు అంగీకరించారు. 2024 జులై 1, 2025 జనవరి ల నుంచి పెండింగ్‌లో ఉన్న ఈ రెండు డీఏలను 2026 అక్టోబర్ 1 నుంచి చెల్లించనున్నారు. సీఎం క్యాంపు కార్యాలయంలో శనివారం జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని ఉద్యోగ సంఘాల నేతలతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. రాష్ట్ర ప్రస్తుత ఆర్థిక పరిస్థితి, ఆదాయ - వ్యయాల వివరాలను

-మిగతా 2 లో






## ఉపాధ్యాయులే మార్గదర్శకులు

- వ్యక్తిత్వ వికాసానికి బాటలు వేసేది వారే
- వారి గొప్పదనాన్ని అందరూ గుర్తించాలి
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ఏపీ బ్యూరో

విజ్ఞాన వృక్షంలాంటి గురువు గొప్పదనాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆయన ఉపాధ్యాయులకు శనివారం ఒక ప్రకటనలో హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మనకు అక్షర జ్ఞానాన్ని అందించి, వ్యక్తిత్వ వికాసానికి బాటలు వేసి, ఉజ్జ్వల భవిష్యత్తుకు మార్గదర్శకులుగా నిలిచే

-మిగతా 2 లో

## తరగతి గదికి పరిమితం కావద్దు



02

- డ్రగ్స్, స్క్రీన్ టైమ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టండి
- విద్యార్థుల జీవితాల్లో టీచర్లు భాగమవ్వాలి
- చదువుతోపాటు పిల్లల ఆసక్తులు, అలవాట్లు గుర్తించాలి
- మాదకద్రవ్యాల ముప్పుపై అవగాహన కల్పించాలి
- క్రీడలతో మొబైల్ స్క్రీనింగ్‌కు చెక్ పెట్టవచ్చు
- బోధనలో సృజనాత్మక పద్ధతులను ప్రవేశపెట్టాలి
- జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రధాని మోదీ ఉద్బోధ




## విద్యా వ్యవస్థలో సంస్కరణలకు కట్టుబడి ఉన్నాం

- ఏటా డీఎస్సీ.. 2029లోగా మరో మూడు!
- మా ప్రభుత్వాల హయాంలో 2 లక్షల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ
- 14 డీఎస్సీలు పూర్తి చేసిన ఘనత సీఎం చంద్రబాబుదే
- డీఎస్సీ, ఏపీపీఎస్సీ తేడా తెలియనివారు కూడా విమర్శలు చేస్తున్నారు
- 'ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్' దేశానికి ఆదర్శంగా ఉండాలి
- విద్యాశాఖ మంత్రి నారా లోకేష్

, అమరావతి

రాష్ట్ర విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేసి, నేటి కాలానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దేలా సమూల సంస్కరణలు చేపడుతున్నామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. పిల్లలను గొప్పవాళ్లుగా తీర్చిదిద్దే అద్భుతమైన అవకాశం ఉపాధ్యాయులకు మాత్రమే ఉందని పేర్కొన్నారు. విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మంత్రి నారా లోకేష్ ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగించారు. ఉపాధ్యాయుల నియామకానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వాల హయాంలో ఇప్పటివరకు 2 లక్షల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటివరకు 14

-మిగతా 2 లో



02

## బీఎల్ఏ దాడిలో 25 మంది పాక్ సైనికులు మృతి

- పాక్ సైన్యంపై బీఎల్ఏ వరుస దాడులు
- వేర్వేరు ఘటనల్లో 25 మంది సైనికులు మృతి
- జియారత్ క్రాస్ వద్ద కాన్వాయ్‌పై దాడి
- ఐదు వాహనాలపై దాడిలో 18 మంది మృతి
- సూరబ్‌లో జరిగిన దాడిలో ఏడుగురు సైనికులు మృతి
- దాడులకు బాధ్యత వహించిన ఫతేహ్, ఎస్‌టీఓఎస్ గ్రూపులు
- ఘటనలపై పాక్ ప్రభుత్వం స్పందించలేదు
- బెలూచిస్తాన్‌లో మరోసారి ఉద్రిక్తత

# బీఆర్ఎస్ కోటలపై దండయాత్ర

సిరిసిల్ల, సిద్దిపేటలో కాంగ్రెస్ జెండా పాతుతాం

- కేసీఆర్ సభకు రా..లేదా గౌరవంగా రాజీనామా చేయి
- నేను ఉన్నంతకాలం బీఆర్ఎస్‌ను ఎదగనివ్వను
- రైతులు, మహిళలు, యువత సంక్షేమమే లక్ష్యం
- వెయ్యి రోజుల పాలనలో రూ.1.70 లక్షల కోట్ల రైతు ప్రయోజనాలు
- 2029లో కాంగ్రెస్‌కు 90 సీట్లు ఖాయమన్న సీఎం
- వెయ్యి రోజుల ప్రగతి పాలన సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- నకిరేకల్ లో భారీ బహిరంగ సభ

నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

'ప్రతిపక్షనేత కే చంద్రశేఖరరావు (కేసీఆర్) శాసనసభకు రా... లేకుంటే గౌరవంగా పదవికి రాజీనామా చేయి...గజ్వేల్‌లో తేల్చుకుందాం' అని సీఎం ఏ రేవంత్‌రెడ్డి సవాలు విసిరారు. "మీరు రాయి విసిరితే.. మేము ఆ రాయితోనే సమాధానం చెబుతాం... మీ సంస్కారం ఏంటో నా సంస్కారం ఏంటో కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు కలిసి అసెంబ్లీకి రావాలి. అక్కడే చూసుకుందాం. రైతులు, నిరుద్యోగులు, మహిళలు, విద్య, సంక్షేమం సహా అన్ని అంశాలపై వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు సిద్ధం"

-మిగతా 2 లో



# తరగతి గదికి పరిమితం కావద్దు

**-డ్రగ్స్, స్క్రీన్ టైమ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టండి**
**-విద్యార్థుల జీవితాల్లో టీచర్లు భాగమవ్వాలి**
**-చదువుతోపాటు పిల్లల ఆసక్తులు, అలవాట్లు గుర్తించాలి**
**-మాదకద్రవ్యాల ముప్పుపై అవగాహన కల్పించాలి**
**-క్రీడలతో మొబైల్ స్క్రీనింగ్‌కు చెక్ పెట్టవచ్చు**
**-బోధనలో సృజనాత్మక పద్ధతులను ప్రవేశపెట్టాలి**
**-జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రధాని మోడీ ఉద్బోధ**



న్యూఢిల్లీ: డ్రగ్స్ దుష్పరిణామాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించండి, స్క్రీన్ టైమ్ (మొబైల్ ఫోన్) తగ్గించడంలో వారికి సాయం చేయండి అని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం జాతీయ పురస్కారం పొందిన ఉపాధ్యాయులతో సంభాషిస్తూ సమాజంలోని ప్రతి ఒక్కరూ విద్యార్థులను సృజనాత్మక కృషి వైపు ప్రోత్సహించాలని అన్నారు. ఉపాధ్యాయులు తరగతి గదికే పరిమితం కాకుండా విద్యార్థుల ప్రవర్తన, రోజువారీ జీవితంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థలు తగ్గుతున్న నేపథ్యంలో పిల్లల జీవితాల్లో ఉపాధ్యాయుల పాత్ర మరింత ముఖ్యమవుతోందని అన్నారు. డ్రగ్స్ విషయంలో కొన్ని పెద్ద నగరాలు, విశ్వవిద్యాలయాల్లో ఎవరు ఎవరికి ఏమిచ్చారో తెలియకపోవడం వల్ల సమస్య ఎవరిని ప్రభావితం చేస్తోందో గుర్తించడం కష్టమని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉపాధ్యాయులు అవగాహన కోసం చర్యలు తీసుకోవాలి, ఏ పిల్లవాడిలోనైనా ప్రవర్తనలో మార్పు కనిపిస్తే సూక్ష్మంగా గమనించాలి అని సూచించారు. విద్యార్థి బాల్యం చనిపోనివ్వకూడదు, విద్యార్థుల జీవితాల్లో బాల్యాన్ని సజీవంగా ఉంచడంలో ఉపాధ్యాయులే అతిపెద్ద కృషి చేయగలరని అన్నారు. స్క్రీన్ టైమ్ పెద్ద సమస్యగా మారిందని ప్రధానమంత్రి అన్నారు. పిల్లలు మొబైల్ ఫోన్లలో ఎంత సమయం గడుపుతున్నారు, రాత్రి పొద్దుపోయాక కూడా మొబైల్ ఫోన్లు వాడుతున్నారా అని తల్లిదండ్రులను వాకబు చేయాలని ఉపాధ్యాయులను కోరారు. క్రీడలు, సృజనాత్మక కార్యకలాపాలపై ఆసక్తి పెంచడం ద్వారా పిల్లలు క్రమంగా అధిక స్క్రీన్ టైమ్ వినియోగం నుంచి బయటపడవచ్చుని సూచించారు.

# పీఆర్‌సీకి గ్రీన్ సిగ్నల్

మొదటి తరువాయి

ఉద్యోగ సంఘాల నేతలకు సీఎం వివరించారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిపారు.

సరెండర్ లీవులకు చెల్లింపులు

2022 సంవత్సరానికి సంబంధించిన సరెండర్ లీవుల మొత్తాన్ని వచ్చే సంక్రాంతిలోగా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేసేందుకు ప్రభుత్వం అంగీకరించింది. పోలీసు సిబ్బందికి అదనంగా ఒక సరెండర్ లీవును ఈ దసరాకు చెల్లించేందుకు సీఎం సుముఖత వ్యక్తం చేశారు.

పెన్షనర్లకు అదనపు క్వాంటమ్ పునరుద్ధరణ

గత ప్రభుత్వం రద్దు చేసిన పెన్షనర్ల అదనపు క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను వచ్చే ఏడాది జనవరి నుంచి పునరుద్ధరించేందుకు నిర్ణయించారు. ఇందులో భాగంగా 70 ఏళ్లు దాటిన వారికి 10 శాతం, 75 ఏళ్లు దాటిన వారికి 15 శాతం అదనపు క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ వర్తించనుంది. ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్)ను క్రమబద్ధీకరించాలని సీఎం ఆదేశించారు. వచ్చే నెల నుంచి ప్రతి నెల ఆ నెలకు సంబంధించిన మొత్తాన్ని ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌కు చెల్లించాలని అధికారులను ఆదేశించారు. ఉద్యోగుల కోసం తీసుకున్న ఈ నిర్ణయాల వల్ల ప్రభుత్వంపై ఏటా సుమారు రూ.2,880 కోట్ల ఆర్థిక భారం పడుతుంది.

రూ.30,849 కోట్ల పెండింగ్ బిల్లులు క్లియర్

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఉద్యోగులు అర్థం చేసుకోవాలని కోరారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ గత రెండేళ్లుగా ప్రతి నెల ఒకటో తేదీన క్రమం తప్పకుండా జీతాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్లు చెల్లిస్తున్నామని తెలిపారు. సీపీఎస్ పరిధిలోని 11 వేల మంది ఉద్యోగులకు ఓపీఎస్ వర్తింపజేశామని చెప్పారు. ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల్లో ఇప్పటి వరకు రూ.30,849 కోట్లను క్లియర్ చేశామని సీఎం తెలిపారు. గత ప్రభుత్వం అధిక వడ్డీలకు అప్పులు తీసుకురావడంతో ఆర్థిక భారం పెరిగిందని, ఆర్థిక సంస్థలతో చర్చించి రూ.1.50 లక్షల కోట్ల మేర అప్పులపై వడ్డీ భారాన్ని తగ్గించేలా రీషెడ్యూల్ చేశామని వివరించారు. ప్రస్తుతం ప్రభుత్వ అప్పులపై సగటున 9.1 శాతం వడ్డీ చెల్లిస్తున్నామని, ఈ భారాన్ని మరింత తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. విధ్వంసమైన వ్యవస్థలను క్రమంగా గాడిలో పెడుతున్నామని సీఎం పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, ఆర్థిక వెసులుబాటు కలిగిన మేరకు ఉద్యోగులకు సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేశామని, 43 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చామని గుర్తుచేశారు.

ప్రభుత్వ నిర్ణయాలపై ఉద్యోగుల హర్షం

ఉద్యోగుల పెండింగ్ సమస్యలు, డిమాండ్ల పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయాలపై ఉద్యోగ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పీఎఫ్ రుణాలు కూడా అందక ఇబ్బందులు పడ్డామని, ఆర్థిక సమస్యల కారణంగా పెళ్లిళ్లు సైతం వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని ఉద్యోగ సంఘాల నేతలు పేర్కొన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు ప్రయోజనం చేకూర్చే అదనపు క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను పునరుద్ధరించడంపై కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల్లోని ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును పెంచినందుకు కూడా ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని తాము అర్థం చేసుకుంటున్నామని, రాష్ట్రాభివృద్ధికి, ప్రభుత్వానికి తమవంతు పూర్తి సహకారం అందిస్తామని ఉద్యోగ సంఘాల నేతలు తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, ఆనం రామనారాయణ రెడ్డి, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## విద్యా వ్యవస్థలో సంస్కరణలకు కట్టుబడి ఉన్నాం

మొదటి తరువాయి

డీఎస్సీలను పూర్తి చేసిన వ్యక్తి అని లోకేష్ పేర్కొన్నారు.

ఏటా డీఎస్సీ నిర్వహిస్తాం

రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ఇకపై ఏటా డీఎస్సీ నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి నారా లోకేష్ ప్రకటించారు. 2029 నాటికి మరో మూడు డీఎస్సీలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. విద్యా వ్యవస్థకు అవసరమైన మేరకు ఉపాధ్యాయుల నియామక ప్రక్రియను కొనసాగిస్తామని తెలిపారు. డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి తేడా తెలియని వారు కూడా తమ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని లోకేష్ మండిపడ్డారు. ఉపాధ్యాయ నియామక ప్రక్రియ విషయంలో ప్రభుత్వం స్పష్టమైన విధానంతో ముందుకు వెళ్తోందని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలంటే పాఠశాలల్లో తగినంత మంది ఉపాధ్యాయులు ఉండటం అత్యంత అవసరమని పేర్కొన్నారు.

పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత టీచర్లదే

పిల్లలను గొప్ప వ్యక్తులుగా తీర్చిదిద్దే అవకాశం, బాధ్యత ఉపాధ్యాయులకే ఉందని నారా లోకేష్ అన్నారు. ఒక విద్యార్థి భవిష్యత్తును మార్చగల శక్తి ఉపాధ్యాయుడి చేతిలో ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి, వారికి సరైన మార్గనిర్దేశం చేయాలని సూచించారు. మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలు, ప్రపంచవ్యాప్త పరిణామాలపై అవగాహన కల్పించేలా విద్యా విధానాన్ని రూపొందిస్తున్నామని తెలిపారు.

117 జీవోతో పిల్లలను బడులకు దూరం చేశారు

గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 117 కారణంగా పిల్లలు పాఠశాలలకు దూరమయ్యారని మంత్రి లోకేష్ విమర్శించారు. విద్యార్థులకు అనుకూలమైన విధానాలతోనే విద్యా వ్యవస్థను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర విద్యా వ్యవస్థలో సంస్కరణలకు ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. నేటి కాలానికి అనుగుణంగా సిలబస్‌లో మార్పులు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు భవిష్యత్తులో అవసరమయ్యే నైపుణ్యాలను చిన్న వయసు నుంచే అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

# పాక్ చిత్తు చిత్తు!

**-7 వికెట్ల తేడాతో టీమిండియా హ్యాట్రిక్ విక్టరీ**
**-55 పరుగులకే చాపచుట్టేసిన దాయాది**
**--8.4 ఓవర్లలోనే ఛేదించిన భారత్**
**--ఓటమితో మూసుకుపోయిన పాక్ సెమీస్ దారులు**
**--అత్యధిక మ్యాచ్‌లాడిన కెప్టెన్‌గా కౌర్ రికార్డు**
**-మహిళల టీ20 ఆసియా కప్ టోర్నీ**




దుబాయ్: మహిళల ఆసియా కప్ 2026 గ్రూప్-ఎ బ్లాక్‌బస్టర్ మ్యాచ్‌లో భారత్ హ్యాట్రిక్ విజయం నమోదు చేసుకుంది. చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్ల తేడాతో రికార్డు విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నది. ఇప్పటికే వరుసగా రెండు మ్యాచ్‌లు గెలిచి సెమీఫైనల్‌కు చేరిన హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం.. పాక్‌ను మట్టికరిపించి వరుసగా మూడో విజయాన్ని అందుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ 55 పరుగులకే కుప్పకూలింది. ఈ స్వల్ప లక్ష్యాన్ని భారత్ 8.4 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి సాధించింది. తొలుత పాకిస్తాన్ కెప్టెన్ ఫాతిమా సనా రెండో ఓవర్లో షఫాలీ వర్మ (12) ను అవుట్ చేసింది. లెంగ్త్ బంతిని ఆన్-సైడ్ వైపు పంచ్ చేయడానికి షఫాలీ ప్రయత్నించగా, బంతి బ్యాట్ అంచుకు తగిలింది. ఆ బంతిని తన ఫాలో-త్రూలో రజికా పట్టుకుంది. తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన ప్రతీకా రావుల్ రేజింగ్‌లో బౌండరీతో ఖాతాను తెరిచి.. ఓవర్ చివరి బంతికి ప్రతీకా రావుల్ (4) క్యాచ్-బిహైండ్ అయ్యింది. వన్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన స్మృతి మంధాన.. క్రీజులో ముందుకు వచ్చి ఫాతిమా సనా విసిరిన బంతిని మిడ్-వికెట్ దిశగా బలంగా బాది అద్భుతమైన ఫోర్ సాధించింది. అయితే ఆ పేసర్ వెంటనే కోలుకుని బంతిని కొంచెం ఫుల్ లెంగ్త్‌లో విసరగా, అది మంధాన ప్యాడ్లకు తగలడంతో ఆమె ఎల్బీడబ్ల్యూగా (9) వెనుదిరిగింది. కాగా, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 18 పరుగులు, దీప్తి శర్మ 12 పరుగులు చేయడంతో భారత్ ఘన విజయం సాధించింది. భారత జట్టు 8.4 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 57 పరుగులు చేసింది.

పాక్ అతి తక్కువ స్కోర్..

టాస్ గెలిచిన పాకిస్తాన్ కెప్టెన్ ఫాతిమా సనా తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. పాకిస్తాన్ ఓపెనర్లుగా మునీబా అలీ, షవాల్ జుల్ఫికర్ క్రీజులోకి రాగానే మనోళ్లు రెచ్చిపోవడంతో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పాక్ 18.1 ఓవర్లలో 55 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్లు మునీబా అలీ (13), షవాల్ జుల్ఫికర్ (14) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. మిగతా వారంతా సింగిల్ డిజిట్ స్కోర్‌కే వెనుదిరిగారు. గుల్ ఫిరోజా, ఫాతిమా సనా, నష్రా సుందు డకౌట్ అయ్యారు. భారత్ బౌలర్లలో నల్లపురెడ్డి చరణి, ప్రేమ్ రావత్ చెరో 3 వికెట్లు తీయగా.. దీప్తి శర్మ 2 వికెట్లు, షఫాలీ వర్మ 1 వికెట్ తీసి పాక్ నడ్డి విరిచారు. పాకిస్తాన్ జట్టుకు టీ20ల్లో ఇదే అత్యల్ప స్కోరు కావడం గమనార్హం. అంతకుముందు పాక్ 2024లో న్యూజిలాండ్‌పై 56 పరుగులకు ఆలౌటైంది.

మహిళల టీ20ల్లో కెప్టెన్‌గా అరుదైన రికార్డు

మహిళల టీ20 ఆసియా కప్ టోర్నీ 2026లో భాగంగా శనివారం దుబాయ్ వేదికగా భారత్, పాకిస్తాన్ మధ్య జరిగిన మ్యాచ్‌లో భారత్ కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్ అరుదైన ఫీట్ సాధించింది. మహిళల అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో కెప్టెన్‌గా అత్యధిక మ్యాచ్‌లు ఆడిన వారిలో హర్మన్ తొలి స్థానంలో నిలిచింది. హర్మన్‌కు కెప్టెన్‌గా ఇది 150వ మ్యాచ్. పురుషుల, మహిళల క్రికెట్‌లో అత్యధిక మ్యాచ్‌ల్లో కెప్టెన్‌గా వ్యవహరించిన రికార్డు కూడా హర్మన్ పేరిటనే ఉండటం విశేషం. ఈ జాబితాలో శ్రీలంక కెప్టెన్ చమరి అతపట్టు (121) రెండో స్థానంలో, ఆస్ట్రేలియాకు చెందిన మెగ్ లానింగ్ (100), ఇంగ్లాండ్ హెదర్ నైట్ (96) మ్యాచ్‌లతో తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు. కాగా, హాంగ్‌కాంగ్‌తో జరిగిన మ్యాచ్‌లో స్మృతి మంధాన 124 పరుగులతో రికార్డు శతకం నమోదు చేసి, మహిళల అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచారు.

# బీఆర్ఎస్ కోటలపై దండయాత్ర

మొదటి తరువాయి

అని తేల్చిచెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ ?వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నల్లగొండ జిల్లా నకిరేకల్ పట్టణంలో రూ.32 కోట్లతో నిర్మించిన వంద పడకల ఏరియా ఆస్పత్రిని శనివారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. అక్కడే పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీలపై ఘాటైన విమర్శలతో రాజకీయాలను వేడి పుట్టించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్‌లపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రాన్ని తొమ్మిదిన్నరేండ్లు పాలించిన బీఆర్ఎస్ అన్ని రకాలుగా రాష్ట్రాన్ని ముంచి గద్దెదిగిపోయిందని విమర్శించారు. 'బీఆర్ఎస్ కోటలపై కాంగ్రెస్ దండయాత్ర చేస్తుంది. ?సిరిసిల్ల, సిద్దిపేటలో కాంగ్రెస్ జెండా పాతుతాం' అని సీఎం రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ నెలాఖరులో సిరిసిల్లకు వెళ్లి మూడు రంగుల జెండా ఎగురవేస్తానని, ఆ తర్వాత సిద్దిపేటపై దండయాత్ర చేస్తానని ప్రకటించారు. బీఆర్ఎస్ నుంచి వచ్చే విమర్శలకు ఇకపై వెనక్కి తగ్గేది లేదని ష్టంచేశారు. బీఆర్ఎస్ నేతలు రాష్ట్రాన్ని బందిపోట్లులా దోచుకున్నారని అన్నారు. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రైతులు మోసపోయారని గుర్తుచేశారు. చివరి విడత రైతు భరోసా నిధులు వేయకుండానే గద్దె దిగిపోయారని చెప్పారు. సంపాదన పోయిందని బావ, బామ్మర్ది ఏడుస్తున్నారని ఎద్దేవా చేశారు. 'నాకు చదువు లేదని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు, నాకు చదువు లేకపోయినా సంస్కారం ఉంది, అందుకే మీరు రోడ్లపై తిరుగుతున్నారు. నాకు సంస్కారం ఉంది కాబట్టే కొండా సురేఖ, సీతక్కతో రాఖీ కట్టించుకున్నాను' అని తెలిపారు. ఎక్కడ ఆస్తి రాసి ఇవ్వాల్సి వస్తుందోనని చెల్లెని బయటకు గెంటేశారని వ్యాఖ్యానించారు. నాలుగు ఇంగ్లీషు ముక్కలు వస్తే సరిపోదని, ఆడబిడ్డను చూసుకోవాలన్నారు. బీఆర్ఎస్‌కు భవిష్యత్తు లేదని, ఆ పార్టీది అంతా చీకటిమయం అని అన్నారు. రేవంత్ ఉన్నంతకాలం బీఆర్ఎస్ అనే మొక్కనే ఎదగనివ్వనని అన్నారు. తెలంగాణ తులసివనంలో గంజాయి మొక్కను పీకుతామన్నారు. 2029 ఎన్నికల్లో కాంగ్రెస్ 90 స్థానాలు గెలిచి తిరిగి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, నియోజకవర్గాల పునర్విభజన జరిగితే 117 స్థానాల్లోనూ విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

రైతు.. మహిళ.. యువతపై ఫోకస్

రైతు రుణమాఫీ, రైతుభరోసా, ధాన్యం కొనుగోళ్లు, సన్నవడ్ల బోనస్, ఉచిత విద్యుత్ ద్వారా రైతులకు రూ.1.70 లక్షల కోట్ల మేర ప్రయోజనం కల్పించామని సీఎం తెలిపారు. తొలి ఏడాదిలో 25.35 లక్షల మంది రైతులకు రూ.18,617 కోట్ల రుణమాఫీ చేశామని, రైతుభరోసా కింద రూ.36 వేల కోట్లు, ధాన్యం కొనుగోళ్లకు రూ.90 వేల కోట్లు ఖర్చు చేశామని వివరించారు.మహాలక్ష్మి, ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలను ప్రస్తావించిన సీఎం.. మహిళా సంఘాలకు రూ.60 వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించామని తెలిపారు. ?కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పారు. గత బీఆర్ఎస్ పాలనలో ప్రశ్నపత్రాల లీకేజీలు, నియామకాల జాప్యంతో నిరుద్యోగ యువత నష్టపోయిందని విమర్శించారు.

## బీఎల్‌ఏ దాడిలో 25 మంది పాక్ సైనికులు మృతి

న్యూఢిల్లీ,

పాకిస్తాన్‌లో కొంతకాలంగా పాక్ సైన్యానికి, బెలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్‌ఏ)కు మధ్య భీకర పోరు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇరుపక్షాలు పరస్పరం దాడి చేసుకుంటున్నాయి. తాజాగా బీఎల్‌ఏ జరిపిన దాడిలో 25 మంది పాకిస్తాన్ సైనికులు మరణించారు. ఈ విషయాన్ని బీఎల్‌ఏ తాజాగా వెల్లడించింది. పాక్ దాడులకు బదులుగా, బీఎల్‌ఏ జరిపిన వేర్వేరు దాడుల్లో పాక్ సైనికులు మరణించినట్లు తెలిపింది.దీంతో బెలూచిస్తాన్ ప్రాంతంలో మరోసారి ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను కూడా బీఎల్‌ఏ రిలీజ్ చేసింది. బీఎల్‌ఏకు చెందిన ఫతేహ్ స్క్వాడ్ ఈ దాడి చేసినట్లు ప్రకటించింది. శుక్రవారం జియారత్ క్రాస్ వద్ద పాక్ మిలిటరీ కాన్వాయ్‌కు చెందిన రెండు వాహనాలు వెళ్తుండగా బీఎల్‌ఏ దాడి చేసింది. ఈ ఘటనలో 18 మంది పాక్ సైనికులు మరణించగా, మరికొందరు గాయపడ్డారు. ఫతేహ్ స్క్వాడ్.. బీఎల్‌ఏలో చాలా బలమైన సాయుధ రెబల్ గ్రూప్. బెలూచిస్తాన్ పర్వత ప్రాంతాల్లో, గ్యారిల్లా తరహా మెరుపు దాడులు చేయగల సామర్థ్యం ఈ గ్రూప్ సొంతం. ప్రమాదకరమైన దాడుల్ని ఈ గ్రూప్ చేపడుతుంది. గత ఏడాది మార్చిలో జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను హైజాక్ చేసింది కూడా ఈ గ్రూపే. మరో ఘటన సూరబ్ పరిధిలోని హజికా ప్రాంతంలో జరిగింది. బీఎల్‌ఏకు చెందిన ఎస్టీఓఎస్ గ్రూపు పాక్ సైన్యంపై దాడి చేసింది. రిమోట్ కంట్రోల్ వాహనంతో దాడి చేయగా, ఏడుగురు సైనికులు మరణించారు. ఈ రెండు దాడులపై పాక్ నుంచి ఎలాంటి ప్రకటనా రాలేదు. ఈ ఘటనలు పాక్ సైన్యం వైఫల్యంగా అక్కడి విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ వైఫల్యంగా స్థానికులు ఆరోపిస్తున్నారు. పాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బెలూచిస్తాన్‌లో కొంతకాలంగా ఆందోళనలు జరుగుతున్నాయి.

# ఉపాధ్యాయులే మార్గదర్శకులు

ఉపాధ్యాయులను నిత్యం గౌరవించాలని అన్నారు. ఉపాధ్యాయ వృత్తి గౌరవాన్ని అత్యున్నత స్థాయికి చేర్చిన భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఆయన స్ఫూర్తిని ప్రతి ఉపాధ్యాయుడు ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. బంగారు భారతావనిని నిర్మించే బాధ్యతగల పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని ఉప ముఖ్యమంత్రి అన్నారు. బోధన రంగంలో ఉన్న వారందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

# పిల్లల కన్నా వృద్ధుల జనాభా ఎక్కువ!

**-మానవ చరిత్రలో ఇదే తొలిసారి**
**-2025లో తొలిసారి వృద్ధుల జనాభా అధికం**
**-ఐదేళ్లలోపు పిల్లల సంఖ్యను దాటిన వృద్ధులు**
**-తగ్గుతున్న జననాల రేటుతో మారుతున్న జనాభా**
**-పెరుగుతున్న ఆయుర్దాయంతో వృద్ధుల సంఖ్య పెరుగుదల**
**-2025లో 65 ఏళ్లు పైబడిన వారు 85.20 కోట్లు**
**-2060 నాటికి 200 కోట్లకు చేరనున్న వృద్ధులు**
**-ప్రపంచ జనాభాలో 55 శాతం పెరుగుదల వృద్ధుల్లోనే**
**-2060 నాటికి ప్రతి ఐదుగురిలో ఒకరు వృద్ధులే**



న్యూఢిల్లీ,

మానవ చరిత్రలో మొదటిసారి ప్రపంచవ్యాప్తంగా ఐదేండ్లు లేదా అంతకంటే తక్కువ వయసు ఉన్న పిల్లల సంఖ్య కంటే వృద్ధుల సంఖ్య ఇప్పుడు ఎక్కువగా ఉంది. అమెరికా సెన్సస్ బ్యూరో నివేదిక ప్రకారం 2025లో ఈ జనాభా సంబంధిత మార్పు సంభవించింది. తగ్గుతున్న జననాల రేటు, పెరుగుతున్న ఆయుర్దాయం కారణంగా గత ఐదేండ్లలో ప్రపంచవ్యాప్తంగా 65 ఏండ్లు పైబడిన వారి జనాభా శిశువులు, పసిపిల్లలు, ప్రీస్కూల్ పిల్లల జనాభాను అధిగమించింది.


ప్రస్తుతం ప్రపంచంలో అత్యధిక వృద్ధ జనాభా కలిగిన దేశాల జాబితాలో అమెరికా 48వ స్థానంలో ఉంది. అక్కడ 65 ఏండ్లు, అంతకంటే ఎక్కువ వయసు ఉన్నవారి జనాభా 18.9 శాతంగా ఉంది. 2056 నాటికి ఈ సంఖ్య 23.4 శాతానికి పెరుగుతుందని అంచనా. అయితే ఇతర దేశాలలో వృద్ధాప్య జనాభా సంఖ్య వేగంగా పెరుగుతుండడంతో అమెరికా ర్యాంకింగ్ 110వ స్థానానికి పడిపోయే అవకాశం ఉంది.

2060 నాటికి...

65 ఏండ్లు, అంతకంటే ఎక్కువ వయసు ఉన్న వారి సంఖ్య 2025 నాటికి 85.20 కోట్లు ఉండగా 2060 నాటికి అది 200 కోట్లకు పెరుగుతుందని అంచనా. ఈ కాలంలో ప్రపంచవ్యాప్తంగా నమోదయ్యే మొత్తం నికర జనాభా పెరుగుదలలో ఇది ఏకంగా 55 శాతానికి సమానంగా ఉంటుందని ఆక్సియోస్ పేర్కొంది. 2025 నాటికి ప్రపంచ జనాభా 813 కోట్లు ఉండగా 2060 నాటికి అది 1,023 కోట్లకు చేరుకుంటుందని అంచనా. అంటే భూమిపై ఉన్న ప్రతి ఐదుగురిలో ఒకరు 65 ఏండ్లు పైబడినవారు ఉంటారు.

## 4 రాష్ట్రాల్లో ముందుగానే జనగణన.

**-గోవా, యూపీ, పంజాబ్, ఉత్తరాఖండ్‌కు వర్తింపు**
**-డిసెంబర్ 1 నుంచి జనవరి 4 వరకు గణన**
**-జనవరి 5 నుంచి 9 వరకు సమీక్ష దశ**
**-జనగణన చట్టం ప్రకారమే నిర్ణయం**
**-షెడ్యూల్‌ను ధ్రువీకరించిన రిజిస్ట్రార్ జనరల్**
**-కేంద్రం నిర్ణయంపై జైరామ్ రమేశ్ ప్రశ్నలు**
**-ఎన్నికల నేపథ్యంలో ముందస్తు చర్యపై కాంగ్రెస్ విమర్శ**



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5:** జనగణన 2027 ప్రక్రియలో భాగంగా గోవా, ఉత్తర్ ప్రదేశ్, పంజాబ్, మంచు ఉండని ఉత్తరాఖండ్ ప్రాంతాలలో జనాభా లెక్కింపు షెడ్యూల్‌ను కేంద్ర ప్రభుత్వం ముందుగానే చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం శనివారం జారీచేసిన నోటిఫికేషన్ ప్రకారం ఈ రాష్ట్రాలు, ప్రాంతాల్లో జన గణన డిసెంబర్ 1 నుంచి 2027 జనవరి 4 వరకు జరుగుతుంది. అనంతరం జనవరి 5 నుంచి 9 వరకు సమీక్ష దశ నిర్వహిస్తారు. జన గణన చట్టం, 1948, జన గణన నియమావళి, 1990లో నిబంధనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు నోటిఫికేషన్ పేర్కొన్నది.భారత రిజిస్ట్రార్ జనరల్(ఆర్‌జీఐ) కూడా ఈ షెడ్యూల్‌ను ధృవీకరించారు. కాగా ఈ ఆకస్మిక చర్యను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ప్రశ్నించారు. ఇది ప్రభుత్వ పేలవమైన ప్రణాళికను ప్రతిబింబిస్తుందని ఆయన విమర్శించారు. 2027లో నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయని ప్రభుత్వానికి తెలిసినప్పటికీ గణన ప్రక్రియను ఇప్పుడు ఎందుకు ముందుకు జరుపుతున్నారని ఆయన ప్రశ్నించారు.

## ప్రకృతి వ్యవసాయ విస్తరణలో ట్రైనీ ఐసీఆర్పీలదే పాత్ర కీలకం- డీపీఎం శ్రీనివాసులు






**నంద్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 5(నేటి దర్శిని)**
రసాయన రహిత ప్రకృతి వ్యవసాయాన్ని గ్రామస్థాయిలోని ప్రతి రైతు గడపకూ చేరవేయడంలో నూతనంగా ఎంపికైన ట్రైనీ కమ్యూనిటీ రీసోర్స్ పర్సన్ల (టి-ఐసీఆర్పీ) పాత్ర ఎంతో కీలకమని నంద్యాల జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వై. శ్రీనివాసులు స్పష్టం చేశారు. రైతు సాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం ఆధ్వర్యంలో జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ 'ఫేజ్-2' పై ఎంపికైన ట్రైనీ ఐసీఆర్పీలకు స్థానిక జిల్లా ప్రాజెక్టు నిర్వహణ విభాగం కార్యాలయంలో శనివారం ఒకరోజు సమగ్ర అవగాహన శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీపీఎం శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దేందుకు ఈవీసీ విజయ్ కుమార్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో విస్తృత కార్యాచరణ చేపట్టామన్నారు. ఇందులో భాగంగా నూతనంగా విధుల్లో చేరిన ట్రైనీ ఐసీఆర్పీలు గ్రామాల్లో రసాయన సాగు చేసే రైతులను గుర్తించి, వారిని ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. 365 రోజుల పచ్చదనం (365 డిజిసి), తొమ్మిది ప్రకృతి వ్యవసాయ సార్వత్రిక సూత్రాలు, పిఎండిఎస్, బహుళ పంటల విధానాలపై రైతులకు సంపూర్ణ అవగాహన కల్పించాలని సూచించారు. అదనపు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అబ్దుల్ సలాం మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో కమ్యూనిటైజేషన్ ప్రక్రియ ద్వారా మహిళా సంఘాలు, గ్రామ ఐక్య సంఘాలతో మమేకమై పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. గ్రామాల్లో విత్తన గుళికల తయారీ, జీవ ఉత్ప్రేరకాల వినియోగం, పెరటి తోటల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆరు నెలల ప్రొబేషన్ కాలంలో ప్రతి ట్రైనీ ఐసీఆర్పీ తమ పనితీరును సమర్థవంతంగా ప్రదర్శించి నూరు శాతం లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. శిక్షణా శిబిరంలో ట్రైనీ ఐసీఆర్పీలకు డిజిటల్ అప్లికేషన్ల నిర్వహణపై ప్రయోగాత్మక శిక్షణ ఇచ్చారు. రైతుల నమోదు, జియో-ట్యాగింగ్ కోసం ఉద్దేశించిన 'కృషి మ్యాపర్', 'ఉర్వి', 'ఈ-పంట', 'ఏపీఏఐఎంఎస్' మొబైల్ యాప్‌లను వినియోగించే విధానంపై ప్రత్యక్షంగా వివరించారు. కార్యక్రమంలో నూతన ట్రైనీ ఐసీఆర్పీలు, ఎన్ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

# అంబరాన్నంటిన జన్మదిన సంబరాలు .

-నాగ మల్లేశ్వర రెడ్డికి అడుగడుగునా నీరాజనం .

- కేక్ కటింగ్ లు సేవా కార్యక్రమాలు గురువులకు సన్మానాలు చేసిన అన్నెం నాగ మల్లేశ్వర రెడ్డి .



**శిరివెళ్ళ. సెప్టెంబర్ 5(నేటి దర్శిని)**
మండల పరిధిలోని కోటపాడు గ్రామానికి చెందిన అన్నెం నాగమల్లేశ్వరరెడ్డి జన్మదిన వేడుకలు అంబరాన్ని అంటాయి పలు గ్రామాలలో నాగ మల్లేశ్వర రెడ్డి అభిమానులు శ్రేయోభిలాషులు ఆధ్యాత్మిక గురువులు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు పలువురు భక్తులు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో ఆయన పుట్టిన రోజు వేడుకల సందర్భంగా నీరాజనం పలికారు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు పట్టు శాలువ కప్పి పూలు పండ్లు సమర్పించి ఆశీర్వాదం తీసుకున్నారు అనంతరం కోటపాడు గ్రామం తో పాటు పలు గ్రామాలలో నాగ మల్లేశ్వర రెడ్డి అభిమానులు భారీ కేక్ కటింగ్లు నిర్వహించి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా పుట్టినరోజు వేడుకల సందర్భంగా పలు దేవాలయాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో భోగభాగ్యాలతో అఖండ రాజయోగంతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని ఇటువంటి ఘనమైన పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు ఆయన అభిమానులు తెలియజేశారు.

# మహిళలు మరియు బాలికల సమస్యలపై మౌనాన్ని వీడండి

- ఇతివృత్తంతో రౌండ్ టేబుల్ సమావేశం



**తాళ్ళరేవు, సెప్టెంబర్ 5(నేటి దర్శిని)**
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం పరిధిలోని తాళ్ళరేవు మండలం, కొత్తలంక గ్రామంలో బీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో మహిళలు మరియు బాలికల సమస్యలపై మౌలాన్ని వీడండి అనే ఇతివృత్తంతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీమాబాయి మహిళా మండలి చీఫ్ ఫంక్షనరీ వాసంశెట్టి నందివర్ధన మాట్లాడుతూ మహిళలు మరియు బాలికలకు మద్దతుగా అనేక చట్టాలు ఉన్నా వాటిపై అవగాహన లేక అనేకమంది మహిళలు బాలికలు చట్టాలను సద్వినియోగం చేసుకోలేని పరిస్థితి నెలకొని ఉందని అన్నారు. యానిమేటర్ రత్నకుమారి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరికి చట్టాలపై అవగాహన ఉండాలని తద్వారా అన్యాయాలకు గురికాకుండా ఉంటారని,న్యాయపరమైన హక్కులను పొందే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీమాబాయి మహిళా మండల సిబ్బందితోపాటు ప్రాజెక్టు పరిధిలోని మహిళలు పాల్గొన్నారు.

# చేయూత పెన్షన్లు అప్లై చేసుకునేవారికి శుభవార్త.. కీలక వెసులుబాటు!

**రంగారెడ్డి సెప్టెంబర్ 5(నేటి దర్శిని)**
తెలంగాణ ప్రభుత్వం చేయూత పథకం కింద కొత్త సామాజిక పింఛన్ల విషయంలో మరో శుభవార్త చెప్పింది. కొత్త సామాజిక పింఛన్ల దరఖాస్తుల విషయంలో ముఖ్యమైన స్పష్టీకరణ ఇచ్చింది. దరఖాస్తు చేసేటప్పుడు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు వెంటనే అందుబాటులో లేకపోయినా సరే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సెర్ప్ తెలిపింది. అయితే దరఖాస్తులను పరిశీలించే సమయంలో మాత్రం సంబంధిత ధ్రువపత్రాలను తప్పనిసరిగా సమర్పించాలని సూచించింది. అర్హులైన వ్యక్తులు సులభంగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఈ నిర్ణయం వల్ల చాలామంది అర్హులైన వ్యక్తులు సులభంగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఏర్పడింది. గీత కార్మికుల విషయంలో ఆబ్కారీ శాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ధ్రువీకరణ పత్రం లేకపోయినా ఆధార్ కార్డు, రేషన్ కార్డుతోనే దరఖాస్తు చేసుకోవచ్చు. ఒంటరి మహిళలకు తహసీల్దారు ధ్రువపత్రం, దివ్యాంగులకు సదరం లేదా యూడీఐడీ, చేనేత కార్మికులకు సంబంధిత శాఖ సహాయ డైరెక్టర్ ధ్రువీకరణ పత్రం అవసరం.

**సెప్టెంబర్ 15వరకు చేయూత పింఛన్ల దరఖాస్తు గడువు పొడిగింపు**

ఈ పత్రాలు దరఖాస్తు సమయంలో లేకపోయినా సమస్య లేదు. కానీ ఎంపిక ప్రక్రియలో వాటిని సమర్పించకపోతే దరఖాస్తు తిరస్కరించబడే అవకాశం ఉంది. గతంలో పింఛను పొందినా ఏదైనా కారణంతో నిలిపివేయబడిన వారు కూడా



కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు స్పష్టం

చేశారు. చేయూత పింఛన్ల దరఖాస్తులకు మొదట జూలై 31వరకు గడువు ఉంది. అయితే చాలా మంది ఇంకా దరఖాస్తు చేయలేదని గమనించి ప్రభుత్వం సెప్టెంబర్ 15వరకు గడువును పొడిగించింది.ఆగస్టు 9 నుంచి ఐదు కేటగిరీల్లో దరఖాస్తుల స్వీకరణ ఆగస్టు 9 నుంచి ఐదు కేటగిరీల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, పట్టణాలు, నగరాల్లో బిల్ కలెక్టర్లు క్షేత్రస్థాయి పరిశీలన చేసి అర్హులను ఎంపిక చేస్తారు.ఆగస్టు 30 వరకు ఇప్పటికే 4.34 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో వితంతువుల నుంచి మాత్రమే 2.64 లక్షల దరఖాస్తులు వచ్చాయి. గడువు పొడిగింపు వల్ల మరో 50 వేలకు పైగా దరఖాస్తులు రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.కొత్తగా 2.50 లక్షల మందికి చేయూత పింఛన్లు మంజూరు చేయాలని లక్ష్యం

**రాష్ట్రప్రభుత్వం కొత్తగా 2.50 లక్షల మందికి చేయూత పింఛన్లు మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.** ఈ నిర్ణయాలు అర్హులైన పేదలకు, ముఖ్యంగా వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులకు పెద్ద ఉపశమనం కలిగిస్తాయి. ధ్రువపత్రాలు సమయానికి సిద్ధం కాకపోయినా ముందుగా దరఖాస్తు చేసుకుని తర్వాత పత్రాలు సమర్పించే అవకాశం ఉండటం వల్ల అనేక మంది ప్రయోజనం పొందగలుగుతారు. అర్హులైనవారు సెప్టెంబర్ 15లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో ఘనంగా గురుపూజోత్సవ కార్యక్రమం




**రామన్నపేట సెప్టెంబర్ 5(నేటి దర్శిని)**
యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో ఘనంగా గురుపూజోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగింది, ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పాఠశాల కరస్పాండెంట్ గంగుల నరేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ బి సురేష్, అకాడమిక్ డైరెక్టర్ జి మనీ పూలమాలవేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సమాజంలో గురు బాధ్యత ఎంతో ముఖ్యమైనదని భావి భారత పౌరులు సభ్య సమాజంలో సరైన దారిలో నడవడానికి గురు బాధ్యత ముఖ్యమని అలాంటి బాధ్యతలను సమాజానికి తెలియజేసిన గొప్ప గురువు సర్వేపల్లి రాధాకృష్ణ అన్నారు, నేటి విద్యార్థిని విద్యార్థులకు మహనీయుల చరిత్రతో పాటు వారి త్యాగాలను తెలియాలని ఈ సందర్భంగా అన్నారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులు వత్సవాయి పద్మనామరాజును సన్మానించిన శాసనసభ విప్ దాట్ల సుబ్బరాజు




**ముమ్మిడివరం, సెప్టెంబర్ 5(నేటి దర్శిని)**
సెప్టెంబర్ 5వ తేదీ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం పరిధిలోని ఐ పోలవరం మండలం మురమళ్ల గ్రామంలో శాసనసభ విప్ మరియు ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు, తాను చదువుకున్న సమయంలో తనకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులు వత్సవాయి పద్మనామరాజును ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు.తన విద్యాభ్యాసంలో మార్గనిర్దేశం చేసిన గురువును ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సత్కరించడం ఎంతో ఆనందంగా ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమైనదని, వారి సేవలు ఎల్లప్పుడూ గౌరవించదగినవని అన్నారు.

## నవంబర్ 27 అంతర్జాతీయ బాల్య వివాహాల

# నిర్మూలన దినోత్సవం ప్రకటన

**ముమ్మిడివరం, సెప్టెంబర్ 5(నేటి దర్శిని)**
బాల్య వివాహ రహిత సమాజం కోసం అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని అలర్ట్ స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర సమన్వయకర్త యస్. శ్రీనివాసరావు కోరారు.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా నియోజకవర్గ కేంద్రమైన ముమ్మిడివరంలో ఐ సి. డి. యస్. ఐసిడిఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఎస్ శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ముమ్మిడివరం సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ డి.శివకృష్ణ మాట్లాడుతూ బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించి, ప్రతి బాలికకు విద్య, భద్రత, ఆరోగ్యం మరియు గౌరవప్రదమైన భవిష్యత్తును కల్పించేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్న ఈ కార్యక్రమాన్ని అలర్ట్ స్వచ్ఛంద సేవా సంస్థ జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ అంతర్జాతీయ సేవా సంస్థ సహకారంతో బాల్య వివాహాల నిర్మూలనపై నిర్వహించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో బాల్య వివాహాల నిర్మూలన కోసం అంతర్జాతీయ స్థాయిలో జరుగుతున్న ప్రయత్నాలను వివరించారు.భారతదేశం నుంచి జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ బాల్య వివాహాల నిర్మూలన కోసం చేపడుతున్న విస్తృత ప్రచారం, అవగాహన కార్యక్రమాలు మరియు సామాజిక ఉద్యమం గురించి సమావేశంలో వివరించారు. బాల్య వివాహాల వల్ల బాలికల విద్య, ఆరోగ్యం, హక్కులు మరియు భవిష్యత్తుపై పడే ప్రతికూల ప్రభావాలను అధికారులు, ఉపాధ్యాయులు మరియు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా ప్రతి ఏటా నవంబర్ 27ను బాల్య వివాహాల నిర్మూలనకు అంతర్జాతీయ దినోత్సవంగా గుర్తిస్తూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు మరియు సమాజంలోని అన్ని వర్గాలు కలిసి పనిచేయాల్సిన




అవసరాన్ని స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు వివరించారు.బాల్య వివాహాల నివారణలో ఐసిడిఎస్, పోలీస్ శాఖ, విద్యాశాఖ, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం, పంచాయతీ రాజ్ శాఖ తదితర విభాగాల సమన్వయం ఎంతో కీలకమని పేర్కొన్నారు.

ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయులు బాల్య వివాహాలకు సంబంధించిన అనుమానాస్పద పరిస్థితులను గుర్తించి, సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం అందించాలని సూచించారు.బాల్య వివాహం ఒక కుటుంబ సమస్య మాత్రమే కాదని, అది బాలల హక్కులకు సంబంధించిన సామాజిక సమస్య అని సమావేశంలో పేర్కొన్నారు. బాలికలకు విద్య కొనసాగించే అవకాశం కల్పించడం, తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం, బాల్య వివాహాల వల్ల కలిగే చట్టపరమైన పరిణామాలను వివరించడం ద్వారా బాల్య వివాహాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని తెలిపారు.బాల్యవివాహాలకు ముగింపు,బాలికల విద్యకు ప్రాధాన్యం అనే సందేశంతో జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సమిష్టిగా కృషి చేయాలని సమావేశంలో ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పర్యవేక్షకులు కే తులసి కుమారి, సిహెచ్ పల్లవి, జె.మీనాక్షి,పి నాగలక్ష్మి,దేవి, ఎల్వి రమణ , జిల్లా కోఆర్డినేటర్ కె వెంకటేశ్వరావు, కమ్యూనిటీ సోషల్ వర్కర్స్ ఆర్ తులసి, రేవతి, అరుణ ప్రియ, అర్జున రావు, త్రిమూర్తులు, అంగన్వాడి కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు ,ఏఎన్ఎం లుపాల్గొన్నారు.

# సరికొత్త కాన్సెప్ట్‌తో లీసా



అనన్య నాగళ్ల ప్రధాన పాత్ర పోషిస్తున్న చిత్రం 'లీసా'. జవహర్ పవార్ దర్శకుడు. వెంకట్ దుగ్గిరెడ్డి, ఐల రామకృష్ణ నిర్మాతలు. ఈ సినిమా షూటింగ్ విజయవంతంగా పూర్తయింది. నిర్మాణానంతర కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేసి నవంబర్‌లో సినిమాను విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా దర్శక,నిర్మాతలు మాట్లాడుతూ 'సినిమా చాలా బాగా వచ్చింది. భారతీయ తెరపై ఇప్పటివరకూ రాని కొత్త కాన్సెప్ట్‌తో 'లీసా' తెరకెక్కుతున్నది.రెండు భిన్నమైన జోనర్లను మేళవించి, సరికొత్త పద్ధతిలో ఈ సినిమా రూపొందించాం. ఈ కథ నచ్చి అగ్ర సంగీత దర్శకుడు మణిశర్మ సంగీతం అందించేందుకు సిద్ధమయ్యారు. సినిమా మేకింగ్, అనన్య నాగళ్ల నటన ఈ సినిమా ప్రధాన బలాలు' అని తెలిపారు. అల్లాల రవీరెడ్డి, సుమన్, ముసా అలీ ఖాన్, రత్నాకర్‌రెడ్డి, జబర్దస్త్ సత్యశ్రీ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సహ నిర్మాత, కథనం, ఛాయాగ్రహణం: సతీష్‌రెడ్డి మాసం, సమర్పణ: అయాన్ష్‌రెడ్డి మాసం, నిర్మాణం: ఓంసాయిరామ్ ఆర్ట్స్, ఐరాస్ ఎంటర్‌టైన్మెంట్స్.

# బాక్సాఫీస్ వద్ద 'మీర్జాపూర్' సంచలనం..

## తొలి రోజే రూ.24 కోట్లు!




వెబ్ సిరీస్‌గా ప్రపంచవ్యాప్తంగా అపారమైన క్రేజ్ సంపాదించుకున్న 'మీర్జాపూర్' ఇప్పుడు వెండితెరపై కూడా అదే జోరును ప్రదర్శిస్తోంది. పంకజ్ త్రిపాఠి, అలీ ఫజల్, రవి కిషన్ ప్రధాన పాత్రల్లో నటించిన 'మీర్జాపూర్: ది మూవి' సెప్టెంబర్ 4న థియేటర్లలో విడుదలై బాక్సాఫీస్ వద్ద ఘనమైన ఓపెనింగ్స్ రాబట్టింది.ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం.. ఈ చిత్రం తొలి రోజు భారతదేశంలో సుమారు రూ. 24.75 కోట్ల నెట్ వసూళ్లను సాధించింది. ఇందులో హిందీ వెర్షన్ ద్వారా రూ. 24.60 కోట్లు రాగా, తెలుగు వెర్షన్ ద్వారా దాదాపు రూ. 15 లక్షలు వచ్చాయి. ఇక ఈ సినిమా తొలి రోజు గ్రాస్ వసూళ్లు రూ. 29.70 కోట్లను దాటాయి. ఈ బలమైన ఓపెనింగ్‌తో 'మీర్జాపూర్: ది మూవి' 2026 సంవత్సరంలో అత్యధిక వసూళ్లు సాధించిన హిందీ చిత్రాల జాబితాలో నాలుగో స్థానాన్ని దక్కించుకుంది. గత నెలలో వచ్చిన ఇమ్రాన్ హష్మీ 'ఆవారాపన్ 2' సినిమా తొలి రోజు రూ. 22 కోట్ల నెట్ వసూళ్లను సాధించగా, మీర్జాపూర్ ఆ రికార్డును వెనక్కి నెట్టింది. అయితే, రూ. 30 కోట్ల ఓపెనింగ్‌తో మూడో స్థానంలో ఉన్న 'బోర్డర్ 2' చిత్రానికి ఇది స్వల్ప దూరంలో నిలిచింది. ఇక 'టాక్సిక్', 'ధురంధర్ ది రివెంజ్' సినిమాలు వరుసగా రూ. 55 కోట్లు, రూ. 99 కోట్ల తొలి రోజు వసూళ్లతో మొదటి రెండు స్థానాల్లో కొనసాగుతున్నాయి.

# మోహన్‌లాల్ కొత్త సినిమా 'ఆపరేషన్ గంగా'..

## - వార్ బ్యాక్‌డ్రాప్‌లో అదిరిపోయే ఫస్ట్ లుక్!




మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్ తన కొత్త సినిమాను అధికారికంగా ప్రకటించారు. 'ఎ367' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు 'ఆపరేషన్ గంగా' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు మేకర్స్. ఈ మేరకు చిత్ర యూనిట్ విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను బట్టి ఈ సినిమా పూర్తిగా వార్ (యుద్ధం) బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్నట్లు స్పష్టమవుతోంది. ఈ భారీ ప్రాజెక్ట్‌ను యువ దర్శకుడు విష్ణు మోహన్ తెరకెక్కిస్తుండగా, ప్రముఖ నిర్మాత గోకులం గోపాలన్ శ్రీ గోకులం మూవీస్ పతాకంపై అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో మోహన్ లాల్‌తో పాటు అర్జున్ రాంపాల్, పార్తిబన్, ఆదిల్ హుస్సేన్, భాగ్యశ్రీ బోస్ వంటి భారీ తారగణం నటించబోతుంది.కాగా.. ఈ చిత్రానికి టెక్నికల్ నిపుణులుగా గ్లోబల్ లెవెల్ టెక్నీషియన్స్ పనిచేస్తుండటం విశేషం. ప్రపంచస్థాయి యాక్షన్ మరియు విజువల్స్ అందించేందుకు మేకర్స్ పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించిన 'పుష్ప' చిత్రానికి పనిచేసిన ప్రముఖ సినిమాటోగ్రాఫర్ మిరోస్లావ్ కుబా బ్రోజెక్ ఈ సినిమాకు కెమెరామెన్‌గా వ్యవహరిస్తున్నారు. శాశ్వత్ సచ్‌దేవ్ ఈ చిత్రానికి అదిరిపోయే సంగీతం అందిస్తున్నారు. 'కిల్', 'వార్' వంటి బాలీవుడ్, గ్లోబల్ యాక్షన్ చిత్రాలకు పనిచేసిన ప్రముఖ స్టంట్ డైరెక్టర్ ఓ సే-యెంగ్ ఈ సినిమాలోని భారీ యాక్షన్ సీక్వెన్స్‌లను డిజైన్ చేయబోతున్నాడు.

# ఎల్లమ్మలో కథానాయికగా?

బలగం' దర్శకుడు వేణు యెల్దండి తన ద్వితీయ ప్రయత్నంగా చేస్తున్న సినిమా 'ఎల్లమ్మ'. దిల్‌రాజు నిర్మిస్తున్న ఈచిత్రం ద్వారా సంగీత సంచలనం దేవిశ్రీప్రసాద్ కథానాయకుడిగా పరిచయం అవుతున్న విషయం తెలిసిందే. మరి 'ఎల్లమ్మ'లో కథానాయిక ఎవరు? ఈ ప్రశ్న గత కొంతకాలంగా ఫిల్మ్ వర్గాల్లో వినిపిస్తూనే ఉన్నది. ఈ క్రమంలో చాలామంది కథానాయికల పేర్లు కూడా వినిపించాయి. సాయిపల్లవి నుంచి మొదలై కీర్తిసురేశ్, రష్మిక మందన్నా, కృతి శెట్టి.. ఇలా చెప్పుకుంటూపోతే పెద్ద లిస్టే ఉన్నది. ఇప్పుడు తాజాగా 'రొమాంచకం' బ్యూటీ అనంతిక సనిల్‌కుమార్ పేరు వినిపిస్తున్నది. అయితే.. అందుతున్న సమాచారం ప్రకారం అనంతిక ఈ సినిమాకు కథానాయికగా దాదాపుగా ఖరారైనట్లు వినికిడి.ఇటీవలే దేవిశ్రీప్రసాద్, అనంతికలపై మేకర్స్ ఓ ఫొటోషూట్‌ని కూడా నిర్వహించినట్టు తెలిసింది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన రావాల్సివుంది. ఇక 'ఎల్లమ్మ' కథ విషయానికొస్తే.. ఇది ఓ గ్రామదేవత నేపథ్యంలో సాగే కథ. రంగస్థల కళాకారుడైన 'పర్షి'కి ఎల్లమ్మగా మారాల్సిన అవసరం ఎందుకు వచ్చింది? అసలు ఈ ఎల్లమ్మ ఎవరు? ఎల్లమ్మతల్లికి పర్షి కుటుంబానికీ ఉన్న సంబంధం ఏంటి? అనే ఆసక్తికరమైన ప్రశ్నల నేపథ్యంలో ఈ కథ నడుస్తుంది. 'బలగం' మాదిరిగానే తెలంగాణ నేపథ్య కథాంశంతో ఈ సినిమా సాగుతుంది.



# ఇండస్ట్రీ మారాలంటే ప్రేక్షకులు మారాలి..

## -'పెద్ది' వివాదంపై తాప్సీ కామెంట్స్!



భారతీయ సినిమాలలో మహిళలను వస్తువులుగా చూపించడంపై నటి తాప్సీ పన్ను కీలక వ్యాఖ్యలు చేశారు. కేవలం దర్శక-నిర్మాతలు మాత్రమే కాకుండా, ప్రేక్షకులు కూడా ఈ ధోరణికి వ్యతిరేకంగా పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు. 'పెద్ది', 'టాక్సిక్' వంటి చిత్రాలపై వస్తున్న విమర్శల నేపథ్యంలో తాప్సీ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.ఒక ఇంటర్వ్యూలో తాప్సీ మాట్లాడుతూ.. ప్రేక్షకులు కోరుకుంటున్నదే మేము ఇస్తున్నాము అనే వాదనను చిత్ర పరిశ్రమ తరచుగా తెరపైకి తెస్తుందని చెప్పారు. జనాలు ఏది కోరుకుంటే అది ఇవ్వకపోతే డబ్బులు ఎలా వస్తాయని మేకర్స్ భావిస్తారని, ఈ ఆలోచనా విధానం వల్ల అసలు కళ, నైపుణ్యం వెనుకబడిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం నటులు, దర్శకులు మాత్రమే ఈ సమస్యను పరిష్కరించలేరని, సోషల్ మీడియాలో ప్రేక్షకులు వ్యవహరించే తీరు ఈ సంస్కృతి కొనసాగడానికి కారణమవుతోందని ఆమె విమర్శించారు. సినిమాల్లోని కొన్ని సన్నివేశాలపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ, కొందరు మాత్రం ఆ చిత్రాలలోని ఫోటోలను జూమ్ చేయడం, వీడియోలలో విచిత్రమైన కోణాలను ఉపయోగించి వైరల్ చేయడం వంటి పనులకు పాల్పడుతున్నారని తాప్సీ గుర్తుచేశారు. దీనివల్ల సోషల్ మీడియాలో అలాంటి కంటెంట్‌కు ఆదరణ ఉందని మేకర్స్‌కు సంకేతాలు వెళ్తున్నాయని చెప్పారు. కోవిడ్ మహమ్మారికి ముందు భారతీయ సినిమా మంచి పురోగతిని సాధించి ప్రపంచ స్థాయి చిత్రాలతో పోటీ పడిందని, అయితే ఇప్పుడు మళ్లీ పరిశ్రమ వెనకడుగు వేస్తోందని అభిప్రాయపడ్డారు. ఈ విషయమై చిత్రనిర్మాతలు చివరికి బాధ్యతంతా ప్రేక్షకులపైనే నెట్టేస్తారని, ఆ సమయంలో నటుల దగ్గర ఎలాంటి సమాధానం ఉండదని తాప్సీ వాపోయారు. ఈ పోరాటంలో నటులు ఒంటరివారైపోతారని, కేవలం ప్రేక్షకులు మాత్రమే తమకు సహాయం చేసి ఈ యుద్ధంలో గెలిపించగలరని ఆమె పేర్కొన్నారు. కాగా, రామ్ చరణ్ హీరోగా నటించిన 'పెద్ది' చిత్రంలో జాన్వీ కపూర్ పాత్రపై వచ్చిన విమర్శలు, యష్ చిత్రం 'టాక్సిక్' లో మహిళల చిత్రీకరణపై సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున చర్చ జరిగిన తరుణంలో తాప్సీ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. పెద్ది చిత్రంలో జాన్వీని చూపించిన విధానంపై విమర్శలు రావడంతో ఆ సన్నివేశాలను తొలగించి దర్శకుడు బుచ్చి బాబు క్షమాపణలు కోరిన విషయం తెలిసిందే.

# డ్రాగన్ డేట్ మారదు



'డ్రాగన్' షూటింగ్‌లో ఎన్టీఆర్ భుజానికి గాయమైన విషయం తెలిసిందే. ఆగస్ట్‌లో ఆయనకు సర్జరీ కూడా జరిగింది. ప్రస్తుతం తారక్ రెస్ట్ మోడ్‌లో ఉన్నారు. దాంతో 'డ్రాగన్' సినిమా అనుకున్న డేట్‌కి విడుదల కావడం కష్టమే అంటూ సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఈ సినిమాను వచ్చే ఏడాది జూన్ 11న విడుదల చేయనున్నట్టు ఇప్పటికే నిర్మాతలు ప్రకటించారు. ఈ నేపథ్యంలో వస్తున్న విమర్శలపై నిర్మాతల్లో ఒకరైస్పందించారు. 'డ్రాగన్'ని అనుకున్న డేట్‌లోనే కచ్చితంగా విడుదల చేస్తామని, మరో రెండు వారాల్లో షూటింగ్ మొదలవుతుందని, ఫిబ్రవరి కల్లా షూటింగ్ మొత్తం పూర్తిచేస్తామని రవిశంకర్ తెలిపారు. ఇందులో ఎన్టీఆర్ 'లూగర్' అనే ఉద్వేగపూరితమైన పాత్రలో కనిపించనున్నారు. ప్రశాంత్ నీల్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ఈచిత్రంలో రుక్మిణీ వసంత్, అనిల్‌కపూర్, బిజు మీనన్ ముఖ్య పాత్రలు పోషిస్తున్న విషయం తెలిసిందే


Published and Owned by Katta Hima Pavani Published 19-8-35A,6th Lane, Old Raja Rajeshwaripeta, Vijayawada, NTR district, Andhrapradesh-520001 Printed at Neti Darshini Publications H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505, Editor: Katta Hima Pavani, PRGI NO: APTEL/26/A5450